క్లుప్తంగా

వైభవంగా లక్ష బిల్వార్చన



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం గణపతి హోమం, లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు సింగంపల్లి హైస్కూల్ ప్లస్, రాజానగరం మండలానికి చెందిన గాయత్రి, దివ్య, రత్న ప్రైవేటు కళాశాలల విద్యార్థులు, పుణ్యక్షేత్రం హైస్కూల్ ప్లస్‌కు చెందిన మొత్తం 690 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. శుక్రవారం జరిగే ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరుగుతాయన్నారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి



చిన్నారుల తల్లిదండ్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీగౌరీ

పెదపూడి: ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ శ్రీగౌరీ అన్నారు. మండలంలోని ఏపీత్రయం, కరకుదురు, రామేశ్వరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు ఓటు హక్కుపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్ర

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర రాజానగరం నియోజకవర్గ పార్టీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం సీతానగరం, రఘుదేవపురం సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వీరన్న చౌదరి మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుతున్నారన్నారు. మేకింగ్ ఇన్ ఇండియా అనే నినాదంతో దేశంలో తయారు చేసిన వస్తువులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఏలూరు జిల్లా బీజేపీ కన్వీనర్ ఏపీఆర్ చౌదరి, మండల అధ్యక్షుడు గూడపాటి జయరామ్, జిల్లా సభ్యులు సాంబేలపు బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై దాడి

సీతానగరం: అచ్చయ్యపాలెం శివారులో సారా తయారీ బట్టీపై ఎస్సై టి.రామకృష్ణ తన సిబ్బందితో దాడి చేసి, వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గురువారం చీపురుపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెం శివారున సారా బట్టీ వద్ద బెల్లం ఊటను ధ్వంసం చేసి, 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడు పరారయ్యాడని ఎస్సై వివరించారు.

3న పల్స్ పోలియో

మధురపూడి: మండలంలోని కోరుకొండ, దోసకాయలపల్లి, కోటికేశవరం పీహెచ్‌సీల పరిధిలో మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందర్ కోరారు. ఆయా కేంద్రాల పరిధిలో ఐదేళ్ల లోపు 6,943 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు.

తిరుమలలో నేషనల్ సైన్స్ డే

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా గురువారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. తమ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు ఎంతగానో ఆకర్షించాయని.. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే విధంగా అత్యద్భుతంగా ఉన్నాయని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయనతో పాటు డైరెక్టర్ నున్న సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి తదితరులు అభినందించారు.

ఒత్తిడి జయిస్తే విజయం మీదే..

- పరీక్షలకు సిద్ధమైన ఇంటర్ విద్యార్థులు
- నేడు ఫస్టియర్, మార్చి–2 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షల ప్రారంభం



పందలపాక ప్రభుత్వ మహిళా కళాశాలలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇంటర్మీడియెట్ విద్యార్థినులు

బిక్కవోలు: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమై ఈ నెల 19వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇంటర్మీడియట్ రెండో ఏడాది విద్యార్థులకు శనివారం నుంచి ప్రారంభమై ఈ నెల 20వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులు కొలమానంగా తీసుకుంటారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్మీడియెట్ పరీక్షలనేసరికి విద్యార్థుల్లో తీవ్రమైన ఒత్తిడి నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యమని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు

ఇంటర్మీడియెట్ పరీక్షలు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయి. నిమిషం ఆలస్యమైన పరీక్ష రాసేందుకు కేంద్రాల్లోకి అనుమతించరు. అందుకే ఎలాంటి హైరానా పడకుండా పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకుంటే మంచిది. కేంద్రాల్లోకి అరగంట ముందుగానే విద్యార్థులకు అనుమతిస్తారు. ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత టెన్షన్‌కు గురికాకుండా దానిని అర్థం చేసుకునేందుకు కొంత సమయం తీసుకోవాలి. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాస్తే, కొంత టెన్షన్ తగ్గుతుంది. ప్రశ్నలన్నింటికీ జవాబులు రాసేందుకు ప్రయత్నిస్తే మంచి మార్కులు సాధించవచ్చు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. అందుకే అభ్యర్థులు వాటిని తమతో తీసుకెళ్లకూడదు.

ఆందోళన వీడాలి



విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. ఏడాదంతా చదివిన సబ్జెక్టు అయినందున జవాబులు గుర్తు తెచ్చుకుని రాసేందుకు ప్రయత్నించాలి. తల్లిదండ్రులు కూడా ఇంట్లో విద్యార్థులు చదువుకునేలా అనువైన వాతావరణం కల్పించాలి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్య నిపుణుడు, అనపర్తి

జాగ్రత్తలన్నీ ముందే వివరించాం



ఒత్తిడికి గురవ్వకుండా పరీక్ష రాయాలని విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చాం. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరు గనుక విద్యార్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించాం. పరీక్ష కేంద్రాల్లో ఎలా వ్యవహరించాలో జాగ్రత్తలన్నీ ముందే వివరించాం.

– చిర్ల శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, పందలపాక ప్రభుత్వ మహిళా కళాశాల

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో కొలువుదీరిన సత్తమ్మతల్లి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామానికి చెందిన నల్లమిల్లి వంశీకులు తమ ఇలవేల్పుగా కొలిచే అమ్మవారికి ఏటా మాఘమాసంలో జాతర నిర్వహిస్తుంటారు. అమ్మవారి జాతరలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులతో పాటు పలువురు ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎన్‌డీఆర్, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పాత తుంగపాడులో కనకదుర్గమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాజానగరం మండలం పాత తుంగపాడు గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు రూ.40 లక్షలతో ఆలయ నిర్మాణం జరిగింది. శ్రీవాణీ ట్రస్టు ద్వారా రూ.10 లక్షలు అందజేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల సంక్షేమానికి కృషి



ప్రత్యేక అవసరాల చిన్నారికి టీఎల్ఎం కిట్ అందజేస్తున్న ఎంపీపీ తులసి తదితరులు

పెదపూడి: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జి.మామిడాడలోని భవిత కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న నలుగురు ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఏడీఐపీ పథకంలో కాకినాడ ఎస్ఎస్ఏ ద్వారా టీఎల్ఎం కిట్లు మంజూరు చేశారు. ఎంపీపీ తులసి, ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, సర్పంచ్ లంక మున్ని జెడ్పీబాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటరెడ్డి చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు పి.జ్యోతి, సిబ్బంది ఎం.సత్యవేణి, మండపల్లి బుల్లిరాజు, సీఆర్‌పీ బీర విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే సుస్థిర స్థానం



జగదీశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రంగంపేట: అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటారని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసిన వల్లు జగదీశ్వరరావు ఉద్యోగ విరమణ సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల విద్యాభివృద్ధికి, విద్యార్థుల విద్య ప్రమాణాలు పెంపొందించడానికి జగదీశ్వరరావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చార్లెస్, గణేష్, ప్రసాద్, వరలక్ష్మి, సావిత్రి, బుల్లెమ్మ, రాజేశ్వరి, శైలా, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



రావి వెంకటసాయి, వరలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఫాస్టర్ రవీంద్ర, ఉపాధ్యాయులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్‌సీఎం స్కూల్ హెచ్‌ఎంగా, ఎంపీపీ పాఠశాల ఎస్జీటీగా రావి వెంకటసాయి మాస్టారు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్‌సీఎం హైస్కూల్ ఆవరణలో స్కూల్ మేనేజ్‌మెంట్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రావి వెంకటసాయి ఉద్యోగ విరమణ సన్మానసభ జరిగింది. ఈ సందర్భంగా రావివెంకటసాయి, వరలక్ష్మి దంపతులను ఆర్‌సీఎం చర్చి ఫాస్టర్ రెవరెండ్ రవీంద్ర, ఉపాధ్యాయులు అక్బర్, ఈమని సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి, శుభలక్ష్మి తదితరులు సత్కరించారు. ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, ప్రముఖ చిత్రకారుడు పుప్పాల బాపిరాజు, మాజీ కార్పొరేటర్ రాయుడు సతీష్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, శ్యామ్ పాల్గొన్నారు.

సమన్వయంతో నారసింహుని కల్యాణోత్సవాలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలను అత్యంగా వైభవంగా నిర్వహించడానికి సమన్వయంతో సాగాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక నరసన్న దేవస్థానంలోని కల్యాణ మండపంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ బట్టర్ అధ్యక్షతన జరిగిన ఉత్సవాల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దత్తత దేవస్థానం నరసన్న కల్యాణ ఉత్సవాలు మార్చి నెల 19 నుంచి 25వ తేదీ వరకూ జరుగనున్నాయి. ఆధ్యాత్మికత చాటేలా స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ శాఖల అధికారులంతా సకల ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్ణయించిన ముహూర్తానికే రథోత్సవం, స్వామివారి కల్యాణోత్సవాలను ప్రారంభించాలన్నారు. రాత్రి 12 గంటల లోపు కల్యాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. కొండపైన, కింద మంచి నీటిని భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. రథోత్సవానికి ముందే పారిశుధ్య పనులు పూర్తి చేయాలని, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తగినంత మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం జరిగే సందర్భంలో వైద్య విభాగానికి చెందిన డాక్టర్లు, సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, రెండు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్సుల సదుపాయాన్ని కల్పించాలని, మెబైల్ వైద్యాన్ని అందించాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రథోత్సవంలో రథం లాగేవారికి డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. రంగనాథస్వామి దేవస్థాన ధర్మకర్త పరాసర నరసింహస్వామి బట్టర్, రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి, అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ ఎంపీడీఓ హేమసుందర్, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతోనే గుర్తింపు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



లజపతిరాయ్ దంపతులను సత్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



కడియపులంకలో హైస్కూల్ ప్రహరీని ప్రారంభిస్తున్న మంత్రి వేణు, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎమ్మెల్సీ దుర్గేష్

కడియం: అంకితభావంతో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండలంలో సుదీర్ఘకాలం ఎంఈఓగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వి.లజపతిరాయ్‌కు వీడ్కోలు సభ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగింది. లజపతిరాయ్ దంపతులను మంత్రి వేణు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ సీజీసీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ తదితరులు పాల్గొని లజపతిరాయ్ సేవలను కొనియాడారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు గిరజాల వీర్రాజు, రావిపాటి రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, ఎంఆర్‌పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ట్రస్టు ద్వారా రూ.25 లక్షలతో కడియపులంక హైస్కూల్ ప్రహరీని నిర్మించారు. దీనిని మంత్రి వేణు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ నర్సరీ రంగంలో రాణించడమే కాకుండా సమాజానికి సాయపడాలన్న దృక్పథంతో పల్ల వెంకన్న ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తండ్రి బాటలో నడుస్తూ వెంకన్న కుమారులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతిలు సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గాని సత్యనారాయణ, నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాస్, ఊటుకూరి శైలజ, తాడాల చక్రవర్తి, బోడపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగిపోదామా సాఫీగా..

- సుందరంగా బ్యారేజీ రోడ్డు
- దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీపై నిర్మించిన రోడ్డు

ధవళేశ్వరం: ఆశల సౌధమది... ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పంటలను సస్య శ్యామలం చేస్తున్న అపురూప కట్టడం అది.. కాటన్ ఆలోచనల నుంచి జీవం పోసుకున్న ధవళేశ్వరం కాటన్ బ్యారేజీపై పూర్వ వైభవం ఉట్టిపడుతోంది.. దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని బ్యారేజీ రోడ్డు వైఎస్సార్ సీపీ పాలనలో అందంగా ముస్తాబైంది.. గత కష్టాలను తీర్చుతూ పాలకులు తీసుకున్న చొరవతో సమస్యకు మోక్షం లభించింది. ఇరు జిల్లాలను కలుపుతూ నిర్మించిన ఈ వారధిపై నుంచి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే బ్యారేజీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని తాత్కాలిక మరమ్మతులతో తరచూ రోడ్డుపై గతుకులు పడటంతో సమస్య శాశ్వత పరిష్కారానికి నిధులు విడుదల చేసింది. బ్యారేజీ మూడు ఆర్మ్‌లపై ఉన్న రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు వెచ్చించింది. రోడ్డు పనులు పూర్తి కావడంతో ఫిబ్రవరి 17 నుంచి బ్యారేజీపై వాహనాల రాకపోకలకు అనుమతించారు.

ఇదే ప్రధాన మార్గం

కాటన్ బ్యారేజీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజూ వేలాది వాహనాలు బ్యారేజీ పైనుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం వందలాది మంది రైతులు రాజమహేంద్రవరం వచ్చేందుకు ఇదే ఆధారం. అదేవిధంగా వాడపల్లి, ర్యాలీ తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకూ ఇదే మార్గం. రోడ్డు మరమ్మతులు పూర్తి కావడంతో ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు సమస్యను పరిష్కరించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి

కాటన్ బ్యారేజీ ఆధునీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యి నలభై ఏళ్లు కావడంతో పూర్తి స్థాయి ఆధునీకరణను ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు సైతం పంపింది. ఈ పనులు జరిగితే మరో 20 ఏళ్ల పాటు బ్యారేజీకి ఢోకా ఉండదని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఇన్‌స్టా పరిచయం.. ప్రేమ వివాహం

- ఒక్కటైన ఆంధ్రా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన కొత్త జంట



ఏపీ పోలీసులు, యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ, ఎస్‌ఐలు

తాండూరు రూరల్: ఆంధ్ర అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయం.. ప్రేమగా మారి పెళ్లి పీటలు ఎక్కించింది. ఇద్దరూ మేజర్లే కావడంతో ఖమ్మంలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం తమకు రక్షణ కల్పించాలని కోరుతూ గురువారం కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతపూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీశైలం హైదరాబాద్‌లోని ఓ జ్యూస్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం ఇతనికి ఇన్‌స్టాగామ్‌లో రాజమహేంద్రవరానికి చెందిన అనూషతో పరిచయం ఏర్పడింది. ఇలా సాగిన వీరి స్నేహం ప్రేమగా మారింది. దీంతో కలిసి జీవితం పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అనూష నుంచి ఫోన్ రావడంతో రాజమహేంద్రవరం వెళ్లిన శ్రీశైలం నాలుగు రోజుల క్రితం ఆమెను తీసుకుని ఖమ్మం చేరుకున్నాడు. ఇక్కడే యువతి మెడలో తాళిబొట్టు కట్టాడు. అనంతరం నేరుగా తాండూరుకు చేరుకున్నారు. ఇదిలా ఉండగా అనూష కనిపించకపోవడంతో ఆమె తల్లిదండ్రులు రాజానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. యువతి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శ్రీశైలం అడ్రస్ తెలుసుకుని యువతి తల్లిదండ్రులతో కలసి కరన్‌కోట్ పీఎస్‌కు వచ్చారు. రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ విఠల్‌రెడ్డి నూతన దంపతులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. తమతో రావాలని ఎంత బతిమాలినా అనూష వినలేదు. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. అనూష అడ్రస్ లభించడంతో అదృశ్యం కేసును కొట్టేస్తామని రాజానగరం పోలీసులు తెలిపారు.